క్లుప్తంగా

పాఠశాలలకు కంప్యూటర్‌ల పంపిణీ

మండల వ్యాప్తంగా 23 అందజేత



ఉపాధ్యాయులకు కంప్యూటర్లు అందజేస్తున్న ఎంఈవో విజయరామారావు

దుద్యాల్: మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాలలకు బుధవారం మండల విద్యాధికారి విజయ రామారావు కంప్యూటర్లను పంపిణీ చేశారు. మండలంలో ప్రస్తుతం 17 ప్రాథమిక పాఠశాలలు అందుబాటులో ఉండగా విద్యార్థుల సంఖ్యను బట్టి 23 కంప్యూటర్లను అందజేశా. కంప్యూటర్ విద్యను విద్యార్థులకు అర్థమయ్యే విధానంలో నేర్పించాలని, వారికి కంప్యూటర్ పరిజ్ఞానం అందించాలని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయండి

ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు శ్రీకాంత్



రాజశేఖర్ రెడ్డితో మండల బీజేపీ నాయకులు

దుద్యాల్: మండలంలో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బుద్ద రాజశేఖర్ రెడ్డితో సమావేశమయ్యారు. మండలంలో పార్టీ స్థితి గతులపై చర్చించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో బీజేపీ అత్యధిక సీట్లు గెలిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హకీంపేట్ గ్రామ బీజేపీ అధ్యక్షుడు శివకుమార్, ఉపాధ్యక్షుడు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్ని ఫిజియోథెరపీకి తీసుకురావాలి

ఎంఈఓ చంద్రప్ప



ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న ఎంఈఓ చంద్రప్ప

బంట్వారం: వారానికోసారి నిర్వహించే ఫిజియోథెరపీకి ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను తల్లిదండ్రులు తప్పనిసరిగా తీసుకురావాలని కోట్‌పల్లి ఎంఈఓ చంద్రప్ప పేర్కొన్నారు. బుధవారం భవిత సెంటర్‌లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు డాక్టర్ శ్రీకాంత్ ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ సుమారు 20మందికి పైగా పిల్లలకు ఫిజియోథెరపీ చేయించడం జరుగుతుందన్నారు. అలాగే వీరికి ప్రతిరోజు తరగతులు నిర్వహిస్తారన్నారు. వారానికోసారి ఫిజియోథెరపీ ఉంటుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని క్రమం తప్పకుండా భవిత కేంద్రానికి తీసుకురావాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపీ డాక్టర్ శ్రీకాంత్, సీఆర్పీ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా ప్రభాకర్ రెడ్డి



నవాబుపేట: బీజేపీ నవాబుపేట మండల ప్రధాన కార్యదర్శిగా ప్రభాకర్ రెడ్డిని నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్ తెలిపారు. తనను మండల ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు జిల్లా నాయకులకు, మండల అధ్యక్షుడు చంద్రకాంత్, తనకు సహకరించిన పార్టీ పెద్దలకు ప్రతీఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

దరఖాస్తుల పరిశీలన త్వరగా పూర్తిచేయాలి

కేశంపేట: ప్రజాపాలనలో ప్రజలు రేషన్‌కార్డుల కోసం చేసుకున్న దరఖాస్తుల పరిశీలన త్వరగా పూర్తిచేయాలని తహసీల్దార్ అజాంఅలీ సూచించారు. కేశంపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ..మండల వ్యాప్తంగా ప్రజాపాలనలో రేషన్‌కార్డుల కోసం 2,600ల దరఖాస్తులు వచ్చాయని, వీటిలో ఇప్పటికే 1,700ల దరఖాస్తుల పరిశీలన పూర్తయినట్టు వెల్లడించారు.

భోజనంలో కోడిగుడ్డు తప్పనిసరి

- ఎంఈఓ వెంకటయ్య
- మధ్యాహ్న భోజనం తనిఖీ



దోమ: మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ గ్యామా, డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులు

తాండూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు తప్పనిసరిగా పెట్టాలని ఎంఈఓ వెంకటయ్య పేర్కొన్నారు. బుధవారం ఆయన ఎమ్మార్సీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ..తాండూరు మండలంలో 70 ప్రభుత్వ పాఠశాలలో 9వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. పాఠశాల పున:ప్రారంభమైనప్పటి నుంచి పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు పెట్టడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారన్నారు. మెను ప్రకారం వారంలో మూడు రోజులు సోమ, బుధ, శుక్రవారం గుడ్డు పెట్టాలన్నారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు 8 నెలల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నమాట వాస్తవమన్నారు. వర్షాకాలంలో పరిశుభ్రత పాటించి వంట నిర్వహించాలన్నారు. ప్రభుత్వం అందజేసిన కొత్త వంట పాత్రల్లోనే వంట చేయాలని సూచించారు.

మెనూ ప్రకారం భోజనం–లక్ష్మణ్‌యాదవ్

బంట్వారం: హాస్టల్ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తెల్లి లక్ష్మణ్‌యాదవ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన డీబీసీడబ్ల్యూఓ ఉపేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పలు బీసీ హాస్టళ్లలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదన్నారు. కొందరు వార్డెన్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. హాస్టళ్లలో చదువుకునే బీసీ విద్యార్థులు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమౌతున్నారన్నారు. అలాగే చాలా కాలంగా పెండింగ్‌లోని ఫీజు రియింబర్స్‌మెంట్‌తో పాటు స్కాలర్‌షిప్‌ను వెంటనే విడుదల చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆయన కోరారు.



బంట్వారం: డీబీసీడబ్ల్యూఓ ఉపేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మణ్‌యాదవ్

నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు..

దోమ: మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ గ్యామా హెచ్చరించారు. బుధవారం దోమ మండల కేంద్రంలోని బాలికల పాఠశాలలో డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులు, ఎంఈఓ వెంకట్, ఎంపీఓ నందకిషోర్‌తో కలిసి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రభుత్వం పాఠశాలల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తుందన్నారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీవిద్య, ఉపాధ్యాయులు స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



దోమ: తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ సభ్యులు

టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు దశరథ్

పరిగి: ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు దశరథ్ పేర్కొన్నారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ వెంకటేశ్వరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అన్ని క్యాడర్ల పదోన్నతులు వెంటనే నిర్వహించాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. అన్ని రకాల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 25ను రద్దు చేసి ప్రతి పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా, 40మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో తరగతికి ఒక్కరు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలలకు రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గంగాధర్, వెంకటయ్య, మోయిజ్, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ గోవిందమ్మకు వినతి..

దోమ: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (టీపీయూఎస్) సభ్యులు విజ్ఞప్తి చేశారు. బుధవారం దోమ మండల కేంద్రంలో తహసీల్దార్ గోవిందమ్మకు వినతి పత్రం అందజేసి వారి సమస్యలను వివరించారు. ప్రతీ పాఠశాలకు పారిశుద్ధ్య నిర్వహణ నిధులు వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఉపాధ్యాయుల సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ముత్యప్ప, మండల అధ్యక్షుడు వసురాం, ప్రధానకార్యదర్శి జంగయ్య, కమిటీ సభ్యులు మెగ్యా, రవికుమార్, మల్లేశం, నరేందర్, బీసీ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు రామకృష్ణ, ధనేశ్వర్, ఎమ్మార్సీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

దుర్గంధం.. మన్నెగూడ చౌరస్తా

ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాలనీవాసులు

పూడూరు: మండల పరిధిలోని మన్నెగూడ చౌరస్తా దుర్గంధంగా మారింది. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. చౌరస్తాలో మురుగు చేరి దుర్వాసన వెదజల్లుతున్నా కాలనీవాసుల ఇబ్బందులను చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.లక్షలు పెట్టి వేసిన రోడ్లు పాడవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై చేరిన మురుగును తొలగించేవిధంగా తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ప్రధాన రోడ్డుపై చేరిన మురుగు

సంక్షిప్త వార్తలు

❖ బ్లాక్‌లో విక్రయిస్తున్నామనేది అవాస్తవం

ధారూరు: హరిదాస్‌పల్లి పీఏసీఎస్‌లో యూరియాను బ్లాక్‌లో విక్రయిస్తున్నామనేది అవాస్తవమని బుధవారం చైర్మన్ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. తమ సంఘం ద్వారా చింతకుంట, హరిదాస్‌పల్లి గ్రామాల రైతులకే కాకుండా మండలంలోని ఇతర గ్రామాల రైతులకు కూడా యూరియాను విక్రయిస్తున్నామని ఆయన తెలిపారు. యూరియా, డీఏపీ ఎరువుల కోసం ఇండెంట్ పెడితేనే తాము పీఏసీఎస్‌కు పంపిస్తున్నామని ఆయన వివరించారు.

❖ కందిపంటపై అవగాహన

యాలాల: మండలంలోని అగ్గనూరు రైతు వేదికలో క్రిషివాస్ యాప్‌లో కంది పంటపై వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన నిర్వహించారు. ఎస్‌బీఐ ఆర్థిక సాయంతో రాయచూర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఇక్రిశాట్ సహకారంతో ఈ యాప్‌ను అభివృద్ధి పరిచినట్లు క్రిషివాస్ యాప్ విషయ నిపుణుడు నర్సింహారెడ్డి తెలిపారు. ఈ యాప్ వల్ల కంది పంటలో అవసరం మేరకే పురుగుమందులు వాడటం, తక్కువ పెట్టుబడి ఖర్చు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ ప్రక్రియ వల్ల పర్యావరణ పరిరక్షణకు ఆస్కారం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యాప్ మేనేజర్ సందీప్, తెగుళ్ల విభాగం అధికారులు రాజేందర్, రాజు, ఏఈఓలు గోపి, వంశీ, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

❖ మల్లప్పకుంట చెరువు పరిశీలన

యాలాల: బాణాపూర్ శివారులోని మల్లప్పకుంట చెరువును తహసీల్దార్ వెంకటస్వామి బుధవారం పరిశీలించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గండిపడింది. గ్రామస్తుల సమాచారం మేరకు గండి పడిన ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం గండి విషయమై ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. వర్షాకాలంలో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

❖ ఘనంగా మైసమ్మ బోనాలు

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో ఎస్సీ కాలనీలో బుధవారం మైసమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో కాలనీలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా వెళ్తూ అమ్మవారి పాటలు పాడుకుంటూ ఆలయం వద్దకు చేరుకుని బోనం సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

❖ వాహనదారులు నంబరు ప్లేట్లు పెట్టుకోవాలి

కుల్కచర్ల: వాహనదారులు ప్రతిఒక్కరూ తప్పనిసరిగా నంబర్‌ప్లేట్లను పెట్టుకోవాలని కుల్కచర్ల ఎస్ఐ రమేశ్ పేర్కొన్నారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలో నంబర్‌ప్లేట్లు లేకుండా తిరుగుతున్న 14వాహనాలను సీజ్ చేసి చలాన్లు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడిపితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమ వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను ఎల్లప్పుడు వెంటతెచ్చుకోవాలన్నారు. మైనర్లకు, వాహనాలు ఇచ్చినా, మద్యం తాగి ఎవరైనా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కంటి చూపు ప్రధానం

మండల వైద్యాధికారి కిరణ్ గౌడ్



పరిగి: విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

కుల్కచర్ల: ప్రతీఒక్కరికి కంటి చూపు ప్రధానమైందని మండల వైద్యాధికారి కిరణ్ గౌడ్ పేర్కొన్నారు. జిల్లా అంధత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతీ బుధవారం కుల్కచర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆప్తమాలిక్ అసిస్టెంట్ జవహర్‌లాల్, స్థానిక వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందసంస్థ సేవలు అభినందనీయం

పరిగి: విద్యార్థులకు స్వచ్ఛందసంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి ఉపేంద్ర పేర్కొన్నారు. పట్టణ కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి అనుసంధానంతో జేకే ఫెన్నాస్ కంపెనీ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 403మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మెరుగైన వైద్యంకోసం రెఫర్ చేశారన్నారు. గురుకులాల్లో చదివే వారు గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఎక్కువగా ఉంటారన్నారు. వారికి ఏదోరకంగా సాయపడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, పాఠశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

వాగుపై వంతెన నిర్మించాలి

కేశంపేట: వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా వాగుపై బ్రిడ్జి నిర్మించాలని డీఎస్పీ మండల అధ్యక్షుడు మహిపాల్ మహరాజ్ అన్నారు. మండల పరిధిలోని పాటిగడ్డ గ్రామ శివారు నుంచి పెద్దవాగు నిండుగా ప్రవహిస్తోందని, దీంతో ఆ రోడ్డులో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆయన ఆరోపించాడు.

భక్తిభావం పెంపొందించుకోవాలి

మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి

కుల్కచర్ల: ప్రతిఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప పేర్కొన్నారు. బుధవారం చౌడాపూర్ మండలం మందిపల్ గ్రామంలోని శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన మహన్యాస ఏకాదశ రుద్రాభిషేకం పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణతో ప్రశాంత వాతావరణం నెలకొంటుందన్నారు. ప్రజల యోగక్షేమాలను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల మాజీ జెడ్పీటీసీ రాందాస్ నాయక్, మందిపల్ మాజీ సర్పంచ్ మఠం ప్రమీల, మండల బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సత్తినేని సుధాకర్ రెడ్డి, ఆలయ అర్చకులు మఠం రాజశేఖర్, రాజు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



పూజలో మాజీ ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి తదితరులు

అర్హులందరికీ రేషన్ కార్డులు



నవాబుపేట: రేషన్ కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట: అర్హులైన ప్రతీఒక్కరికి తెల్లరేషన్ కార్డులు అందజేస్తామని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం కొత్త రేషన్ కార్డుల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తామన్నారు. విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు అందజేస్తామని తెలిపారు. అనంతరం మండలానికి చెందిన లబ్ధిదారులకు మజూరైన రూ.7,36,000ల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను 19 మందికి అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ రామ్ రెడ్డి, తహసీల్దార్ బుచ్చయ్య, ఎంపీడీవో అనురాధ, మాజీప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డులతో పేదలకు మేలు

దుద్యాల్: రేషన్ కార్డులతో పేదలకు మేలు కలుగుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అవుటి శేఖర్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని చెట్టుపల్లి తండాలో లబ్ధిదారులకు మంజూరైన 30 నూతన రేషన్ కార్డులను కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేరుగు వెంకటయ్యతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పదేళ్లుగా బీఆర్ఎస్ అధికారంలో ఉండి కూడా ఒక్క రేషన్ కార్డుకూడా జారీ చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. పేదలకు రేషన్ కార్డు ఉంటే ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ బియ్యంతో మూడు పూటలు వండుకుని తింటారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు రమేశ్ చౌహాన్, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.



దుద్యాల్: నూతన రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న నాయకులు

కార్యదర్శులు పల్లెల్లో ఉండాల్సిందే

తాండూరు ఎంపీఓ సుశీల్‌కుమార్



తాండూరు రూరల్: గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రతీరోజు పల్లెల్లో ఉండాల్సిందేనని తాండూరు మండల ఎంపీఓ సుశీల్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం తాండూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీఓ మాట్లాడుతూ.. వర్షాకాలం సందర్భంగా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ్య కార్మికులతో ఎప్పటికప్పుడు మురుగు తొలగింపజేయాలన్నారు. తొలగించిన చెత్తను ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలించాలన్నారు. అదేవిధంగా మురుగుకాల్వల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లించి దోమలు వ్యాప్తి చెందకుండా మురుగుకుంటల్లో ఆయిల్‌బాల్స్ వేయాలన్నారు. గ్రామాల్లో దోమల వ్యాప్తిని అరికడితే ప్రజలను రోగాలబారి నుంచి తప్పించవచ్చన్నారు. ప్రతీగ్రామంలో విద్యుత్ దీపాల ఏర్పాటు, పైప్‌లైన్ లీకేజీలను ఎప్పటికప్పుడు మరమ్మతులుచేయించాలని సూచించారు.

ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోండి

దోమ: గ్రామంలోని సంఘనాతికుంట తూమును ధ్వంసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని లింగన్‌పల్లి రైతులు విజ్ఞప్తి చేశారు. బుధవారం దోమ మండల కేంద్రంలోని తహసీల్దార్ గోవిందమ్మకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ..గ్రామంలో సంఘనాతి కుంట ఆయకట్టు కింద తమ పొలాలు ఉన్నాయని, ప్రతీయేటా కుంట నుంచి ఆయకట్టు ద్వారా నీరు తీసుకొని పంటలు పండిస్తున్నామన్నారు. సంవత్సరం నుంచి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తూమును ధ్వంసం చేసి దిగువకు నీరు వదులుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తమ పంట పొలాలు నీట మునుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ గోవిందమ్మకు వినతిపత్రం అందజేస్తున్న లింగన్‌పల్లి రైతులు

ఉచిత బస్సు ప్రయాణ సేవలు హర్షణీయం



తాండూరు: ఆర్టీసీ డిపోలో మహాలక్ష్మి సంబరాల్లో అధికారులు, నాయకులు

తాండూరు: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంతో తాండూరు ఆర్టీసీ డిపో ద్వారా 1.30 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణ సేవలు పొందడం హర్షణీయమని తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తాండూరు ఆర్టీసీ డిపో మేనేజర్ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వం మహాలక్ష్మి పథకం అమలు చేసిన నాటి నుంచి ఇప్పటి వరకు మహిళలు ఉచిత ప్రయాణం పొంది రూ.6,780 కోట్లను ఆదా చేసుకున్న సందర్భంగా ఆర్టీసీడిపోలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి మాటాడుతూ..దేశంలో ఎక్కడ లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు నీరజాబాల్‌రెడ్డి, సోమశేకర్, ప్రభాకర్‌గౌడ్, మహిళా నాయకులు కందనెల్లి శోభారాణి, గాజుల మాధవి పాల్గొన్నారు.

మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

అనంతగిరి: మహిళలను కోటీశ్వరులను చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలు 200కోట్ల ఉచిత ప్రయాణాలు, రూ.6,680 కోట్ల ప్రయాణ చార్జీలను ఆదా చేసుకున్న శుభ సందర్భానా వికారాబాద్‌లోని ఆర్టీసీ బస్టాండ్‌లో సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎం అరుణ పాల్గొన్నారు.

కుల్కచర్ల: మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, బ్లాక్ బి అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని మహిళలు ఆర్టీసీ ద్వారా 200కోట్ల సార్లు ఉచిత ప్రయాణాన్ని పురస్కరించుకుని బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని బస్టాండ్‌లో మహిళలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మహిళలను అన్నివిధాలుగా అభివృద్ధిచేయాలన్న సంకల్పంతో సంక్షేమ పథకాల అమలులో మహిళలకే ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కాబట్టి ప్రతిఒక్కరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు క్రిష్టారెడ్డి, కొమ్ము శ్రీనివాస్, భాస్కర్, బాలకృష్ణ, బాబు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



కుల్కచర్ల బస్టాండ్‌లో మహిళలకు స్వీట్లు తినిపిస్తున్న కాంగ్రెస్ నేతలు